రోడ్డుపైనే సంత.. తప్పని చింత

- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు
- ఆదాయం వస్తున్నా.. వసతులు కరువు


దోమకొండలో రోడ్డుపైనే నిర్వహిస్తున్న కూరగాయల సంత

దోమకొండ : మండలకేంద్రంలో ప్రతి సోమవారం వారాంతపు సంత జరుగుతోంది. కిలోమీటర్ పొడవునా శివరాంమందిర్ ఏరియాలో రోడ్డుపైనే సంత జరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. గతేడాది దోమకొండలో తైబజార్ వేలం రూ.2లక్షల70వేలకు పలికింది. గ్రామపంచాయతీకి ఆదాయం వస్తున్నా సౌకర్యాలపై దృష్టి సారించడం లేదని వ్యాపారులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు సంతలో మౌలిక వసతులు లేవు. పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా మార్గాలో రాకపోకలకోసం వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం సమయంలో జనంతో రద్దీగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, పాదచారులు సైతం రాకపోకలు సాగించటం కష్టతరంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంత నిర్వహణకు అవసరమైన ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తైబజార్ వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయంతో సంతలో మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జిల్లాలో చాలా చోట్ల వారాంతపు సంతలకు శాశ్వత స్థలాలు, వసతులు లేక ప్రధాన రోడ్లపైనే జరుగుతున్నాయి.

ప్రత్యేకంగా మడిగెలను నిర్మించాలి

మండల కేంద్రంలో ప్రతి సోమవారం కూరగాయల వారంతపు సంత జరుగుతుంది. దోమకొండ బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శివరాంమందిర్ రోడ్డు వరకు కిలోమీటర్ పోడువునా సంతను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇతరులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సంతల నిర్వహణకు ప్రత్యేకంగా మడిగెలను నిర్మించి, పలు సదుపాయాలు కల్పించాలి. – రాజనర్సాగౌడ్, దోమకొండ



క్లుప్తంగా

నూతన జాతీయ విద్యావిధానం అవసరం



కామారెడ్డి టౌన్: నూతన జాతీయ విద్యావిధానం అవసరమని మాజీ యూజీసీ సభ్యుడు శివరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో భారతీయ శిక్షణ మండల్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో 'నూతన జాతీయ విద్యా విధానం- పరిశోధకులు నిర్వర్తించాల్సిన కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాచీన చరిత్రను వెలికి తీసే సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భారతీయ శిక్షణ్ మండల్ తెలంగాణ రాష్ట్ర ప్రముఖ్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మధుకర్, జిల్లా ప్రముఖ్ పోతన్న, ప్రతినిధులు సతీష్, పూర్ణ, దేవరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రాచ్య విద్యా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి ముప్పారపు ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1964 నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందుటకు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. 6వ తరగతితో పాటు 7-10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉండగా, ఈగడువును మార్చి-10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు సంగంలో ఉచిత వైద్య శిబిరం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని సంగం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్ ఒక ప్రకటలో తెలిపారు. లయన్స్ క్లబ్ బోధన్ వారి సహకారంతో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం స్థల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవన నిర్మాణం కోసం స్థలం పరిశీలించినట్లు తహసీల్దార్ నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. సుమారు ఇరవై ఎకరాల వరకు స్థలం అవసరం ఉంటుందన్నారు. అందరి సహకారంతో స్థలం సేకరణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పనులు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఉపాధి పనులు కొలతల ప్రకారం చేపట్టాలని సూచించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలలోని మొక్కలకు ప్రతి రోజు నీరు పట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని పల్లెప్రకృతివనంతోపాటు ఇతర మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని పోయించాలని ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మండలంలోని బంజారతండా గ్రామపంచాయతీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పంచాయతీలోని రికార్డులను ఎప్పటికప్పుడు రాయాలన్నారు. అనంతరం గ్రామంలోని పల్లెప్రకృతివనం, నర్సరీని ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి


తాండూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నాగిరెడ్డిపేట : గ్రామంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని తాండూర్ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామశివారులోని కంపోస్ట్‌షెడ్డు, వైకుంఠధామాలను ఆయన పరిశీలించారు. కంపోస్ట్‌షెడ్డులో క్రమం తప్పకుండా ఎరువును తయారు చేయించాలని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కు ఆయన సూచించారు. దీంతోపాటు వైకుంఠధామంలో పెరిగిన గడ్డిని, పిచ్చిమొక్కలను తొలగింపజేయాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో ఎక్కడా కూడ పైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. దీంతో పాటు గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలోని మొక్కల బ్యాగులకు క్రమం తప్పకుండా నీటిని పట్టించాలన్నారు. దీంతోపాటు నర్సరీలో షేడ్‌నెట్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్‌ను పరిశీలించారు.

'యూపీఎస్‌పై యుద్ధభేరి' విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ఆదివారం నిర్వహించబోయే యుద్ధభేరి కార్యక్రమం విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ పథకం(యూపీఎస్)ను బలవంతంగా ప్రభుత్వ ఉద్యోగులపై రుద్దడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి, రాష్ట్ర బాద్యులు చంద్రశేఖర్, సునీల్, అనిల్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఏఐటీయూసీ పోరాటం


మాట్లాడుతున్న యూసుఫ్

బాన్సువాడ : కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యత కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా రెండో మహాసభలు శనివారం బాన్సువాడలోని మాత శిశు సంరక్షణ ఆస్పత్రిలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేలాది మంది కార్మికులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీల్లో పని చేస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జీవో 60 ద్వారా కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, హసీనా బేగం, బాల్‌రాజ్, దశరథ్, శంకర్, రేణుక, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, సురేఖ, సంగీత, రజియాబేగం, ధనుంజయ్, గంగారం తదితరులున్నారు.

సైన్స్ మేళాతో విద్యార్థుల్లో నైపుణ్యం


సైన్స్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

భిక్కనూరు: సైన్స్ మేళాలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతోందని తహసీల్దార్ శివప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలని పేర్కొన్నారు. 74 పరిశోధనలను స్టాల్స్‌లో చూసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఎస్సై ఆంజనేయులు, విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ వింధ్య, ఉపాధ్యాయులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాచారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


రామారెడ్డిలో..

మాదిగ అమరులకు నివాళులు

మాచారెడ్డి/రామారెడ్డి/బాన్సువాడ/ఎల్లారెడ్డి : మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ కోసం అమరులైన మాదిగలకు శనివారం పలు చోట్ల మాదిగల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలు రాజీలేని పోరాటం చేసి ప్రాణాలర్పించిన మాదిగ అమరుల త్యాగం వృథాపోలేదన్నారు.


బాన్సువాడలో..


ఎల్లారెడ్డిలో ..

ఆధ్యాత్మికం..

వైభవంగా శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయంలోని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. దీంతోపాటు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామంలో ఉరేగింపు చేపట్టారు. అనంతరం వేదపండితులు దిగంబరశర్మ ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామలతో స్వామివారి కల్యాణం జరిపారు. ఈకార్యక్రమానికి తొగిట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులను ఆశీర్వదించారు.

త్రిలింగేశ్వరాలయం వద్ద ఘనంగా రథోత్సవం



మండలంలోని శ్రీ త్రిలింగేశ్వరాయ ఉత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జబర్దస్త్ టీంచేత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయం వద్ద భక్తులు సామూహికంగా భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. ఆలయం వద్ద పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఖిని మహరాజు, ఎస్సై మల్లారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

సంఘమేశ్వరాలయంలో..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో గల సంగమేశ్వరాలయంలో శనివారం స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో రథంపై ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్‌లో గల హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహరాజ్‌లు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుదర్శన,రుద్ర హోమాలు



కామారెడ్డి అర్బన్: శ్రీరమా సహిత సత్యనారాయణ, పరివాహక దేవతామూర్తుల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం సుదర్శన,రుద్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణ నోములు జరిగాయి. మాచారెడ్డి మాజీ ఎంపీపీ నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ అంజల్‌రెడ్డి, వేదపండితులు రాచర్ల రవిచంద్రశర్మ, కాసర్ల విఠల్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్, సంతోష్, సురేందర్, మహేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

దైవ నామస్మరణ చేయాలి..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): నిత్యం దైవనామస్మరణ చేయాలని సప్తాహ అధ్యక్షులు విఠల్ మహరాజ్ సూచించారు. శనివారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో అఖండ హరినామ సప్తాహ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ దశరథ్, ఏఈవో ప్రవీణ్‌కుమార్, మల్లప్ప పటేల్, బస్వరాజ్ దేశాయ్, విజయదేశాయ్, వార్కారీ భక్తులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి రూ. 50 వేలు విరాళం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. శనివారం మండల బీజేపీ నేత కొండ అనిల్‌గుప్తా ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా దాత అనిల్ గుప్తాను గ్రామస్తులు సన్మానించారు. గ్రామస్తులు రాజు, శ్రీనివాస్, విఠల్, జ్ఞానేశ్వర్, శ్రీను తదితరులున్నారు.

ఉత్సవాలకు బేడీల మైసమ్మ ఆలయం ముస్తాబు



మండలంలోని గోర్గల్ గ్రామ సమీపంలో గల బేడీల మైసమ్మ ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం బోనాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మల్లయోధుల కుస్తీ పోటీలు ఉంటాయన్నారు. భక్తులకు ఆలయ కమిటీ తరపున ఏర్పాట్లు చేశారు.

రేపు పుత్రకామేష్టి యాగం

కామారెడ్డి అర్బన్: సంతానం లేని దంపతులు స్థానిక సంకష్టహర గణపతి ఆలయంలో సోమవారం నిర్వహించే పుత్రకామేష్టి యాగంలో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు సుతారి అంజయ్య, బి.రవీందర్‌గౌడ్, బి.విశ్వనాథంలు ఒక ప్రకటనలో కోరారు. స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: ఈనెల 3నుంచి 5 వరకు మండలంలోని తిర్మలాపూర్‌లో జరిగే శ్రీ పద్మావతి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ అధ్యక్షులు తుప్రాన్ జయశ్రీ శంకర్‌గౌడ్‌లు కోరారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తం

సోమర్యాగడితండా పాఠశాల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడితండా ప్రాథమిక పాఠశాలను ఎంపీవో ప్రకాష్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలి



మాచారెడ్డి : విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని పెంపొందించాలని మండల విద్యాధికారి దేవేందర్‌రావు సూచించారు. శనివారం మండలంలోని లచ్చాపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యసన, సామర్థ్యాలు వచ్చేలా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శైలజ, సీఆర్‌పీ నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పోస్ట్‌మాస్టర్ ఉద్యోగ విరమణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హెడ్‌పోస్ట్‌మాస్టర్ నందులాల్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు తోటి ఉద్యోగులు, వివిధ శాఖల్లోని మిత్రులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. 31 సంవత్సరాలుగా ఆయన అందించిన సేవలను సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుజీత్‌కుమార్ కొనియాడారు. అధికారులు దేవిసింగ్, రాజేందర్‌రెడ్డి, విశ్రాంత అధికారులు బాల్‌రాజ్‌గౌడ్, రాజన్న, శారద, రాజయ్య, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

బాన్సువాడ : బీఆర్ఎస్ పార్టీ నూతన డైరీ, క్యాలెండర్లను శనివారం బాన్సువాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి ప్రతిరూపంతో డైరీ, క్యాలెండర్లను తయారు చేశారన్నారు. నాయకులు మోచీ గణేష్, ఎర్రవాటి సాయిబాబా, శివ, రమేష్ యాదవ్, గౌస్, మైశగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.

సహ చట్టంపై చైతన్యం కావాలి



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టంపై అవగాహన కోసం కృషి చేస్తున్న ముస్లిం మహిళ కార్యకర్తలను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరు సహ చట్టంపై అవగాహన పెంచుకుని చైతన్యం కావాలన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా బేగం, కార్యదర్శి జమున, ప్రతినిధులు అస్మా, ప్రదీప్‌కుమార్, భాస్కర్, లింగమయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మద్నూర్(జుక్కల్): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో శనివారం జాతీయ రహదారిపై పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని లేనిచో జరిమానాలు తప్పవన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

పరీక్షలు అంటే భయపడొద్దు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు పరీక్షలు అంటే భయపడొద్దని జిల్లాహెల్పింగ్ బీఫర్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రతినిధులు సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని కృష్ణాజివాడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అంతకు ముందు మోటివేషన్ క్లాసులపై అవగాహన కల్పించారు. ప్రతినిధులు రాజు, హేమంత్‌కుమార్, కృష్ణాకర్, శ్రీధర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం నివేదిత, ఉపాధ్యాయులు గిర్మబోయి, రమేష్, స్వేత, శ్రీహరి, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం హంగర్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం జుక్కల్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు అందజేశారు. యూత్ ఫోరం సభ్యులు మారుతి, సాయికర్ణజాదవ్, మారుతి, సాయినాథ్, శ్రీనివాస్‌గౌడ్, సునీల్, రవీందర్, శంకర్ తదితరులున్నారు.

25వసారి రక్తదానం చేసిన యువకుడు



కామారెడ్డి అర్బన్: భిక్కనూర్ మండలం లక్ష్మిదేవునిపల్లికి చెందిన బద్దం నిశాంత్‌రెడ్డి 25వ సారి రక్తదానం చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న 78 ఏళ్ల వృద్ధుడికి ఓ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో వెంటనే స్పందించి రక్తదానం చేశాడు. రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, నిశాంత్‌రెడ్డిని అభినందించారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా బాలం బాయ్, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా భూదేవిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, ఏపీఎంలు రాజిరెడ్డి, మోయిజ్, సీసీలు రాములు, లింగం, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని తిమ్మాపూర్‌లో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద మండలాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీలో తలపడ్డారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి 5 తులాల వెండి కడియం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్, శ్రీనివాస్, రమేష్, అరవింద్ తదితరులున్నారు.